క్లుప్తంగా

నేడు పాఠశాల వార్షిక తనిఖీ

బిక్కవోలు: పందలపాకలోని జెడ్పీ హైస్కూల్‌ను వార్షిక తనిఖీ నిమిత్తం జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు సోమవారం వస్తారని ఎంఈఓ-1 సీహెచ్‌వీవీ సత్యనారాయణ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, సీనియర్ సబ్జెక్టు నిపుణులు జిల్లా విద్యాశాఖాధికారితో పాటు ప్యానల్ టీమ్‌గా ఈ తనిఖీలో పాల్గొంటారని తెలిపారు. ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యం, విద్యార్థుల ప్రగతి, వివిధ రికార్డుల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలిస్తారన్నారు.

వ్యాపారులు నిబంధనలు పాటించాలి

మధురపూడి: దీపావళి సందర్భంగా బాణాసంచా సామగ్రిని విక్రయించే వ్యాపారస్తులు నిబంధనలను పాటించాలని లేదంటే చర్యలు తప్పవని కోరుకొండ తహసీల్దార్ సుస్వాగతం హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ దుకాణాలకు అనుమతులు తీసుకోవాలన్నారు. అనుమతులు లేనివారిపై చర్యలుంటాయన్నారు. దుకాణాలను జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలీసు, అగ్నిమాపక శాఖల అధికారుల అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు విక్రయించరాదన్నారు.

పరుగు పందెంలో విద్యార్థి ప్రతిభ

మధురపూడి: కోరుకొండ మండలం కోటికేశవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మదేటి వేణూష్ పరుగు పందెం పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజీలో ఈ నెల 24న జిల్లా స్థాయిలో నిర్వహించిన 200 మీటర్ల రన్నింగ్ పోటీల్లో ప్రథమ స్థానాన్ని కై వశం చేసుకుని, రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. వేణూష్‌ను స్కూల్ హెచ్‌ఎం కేవీ సత్యనారాయణ, పీడీ రాజసునందిని, ఉపాధ్యాయులు అభినందించారు.

ముగిసిన అఖండ జపమాల ప్రార్థనలు



రాజమహేంద్రవరం ఆర్‌సీఎం చర్చిలో జపమాల ప్రార్థనలు

మధురపూడి: ఆర్‌సీఎం చర్చిల్లో క్రీస్తు తల్లి మేరీ మాతను ప్రార్థిస్తూ నిర్వహిస్తున్న అఖండ జపమాల ప్రార్థనలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మండల కేంద్రమైన కోరుకొండ, జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం ఆర్‌సీఎం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. రెవరెండ్ ఫాదర్లు బి. మనోజ్ కుమార్, మాణిక్యం అధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు జపమాల ప్రార్థనలు జరిగాయి. సాయంత్రం రెవరెండ్ ఫాదర్లు వాక్య సందేశం చేశారు. కార్యక్రమంలో కోరుకొండ మండలం బూరుగుపూడి, కోరుకొండ, కాపవరం తదితర గ్రామాలకు చెందిన క్రైస్తవులు పాల్గొన్నారు.

గోవింద క్షేత్రంలో వార్షిక పవిత్రోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న డాక్టర్ వెంకటరాజు, సుజాత దంపతులు, పులవర్తి లక్ష్మణస్వామి

రాజమహేంద్రవరం సిటీ: లాలాచెరువు గోవింద క్షేత్రంలో ఈ నెల 27 నుంచి 30 వరకు వార్షిక పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు తూపురాణి శ్రీమాన్నారాయణాచార్యులు తెలిపారు.

ఆదివారం ఉదయం 6.30 గంటలకు ఉత్సవారంభ స్నపన తిరుమంజనం

సాయంత్రం 6.30 గంటలకు ఉత్సవాంగీకారం, పుణ్యాహ వాచనం, దీక్షాధారణ, అంకురారోపణ, సోమ కుంభావాహన, పవిత్రాధివాసం, మంగళా శాసనం, తీర్థగోష్ఠి తదితర కార్యక్రమాలు నిర్వహించామన్నారు. 28న ఉదయం 8.30 గంటలకు యాగశాల ప్రవేశం, చతుస్థానార్చనలు, కుంభావాహన, అగ్ని ప్రతిష్ఠ, పవిత్రారోహణ, ప్రాయశ్చిత్త హోమం, మంగళాశాసనం, తీర్థగోష్ఠి, సాయంత్రం 5.30 గంటలకు శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ, నిత్యహోమాలు, మంగళాశాసనం, తీర్థగోష్ఠి నిర్వహిస్తామన్నారు. 29న ఉదయం 8.30 గంటలకు చతుస్థానార్చనలు, నిత్య ప్రాయశ్చిత్త హోమాలు, మంగళా శాసనం, తీర్థగోష్ఠి సాయంత్రం 5.30 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం, నిత్య విధి, మంగళాశాసనం, తీర్థగోష్ఠి కార్యక్రమాలు ఉంటాయన్నారు. 30న ఉదయం 8.30 గంటలకు నిత్యహోమం, మహా పూర్ణాహుతి, పవిత్ర విసర్జన, విశేషాలంకారాలు, కుంభప్రోక్షణ, మంగళాశాసనం, తీర్థగోష్ఠి, మహదాశీర్వచనం, పండిత సన్మానం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయ ధర్మకర్తలు మట్టపల్లి రంగప్రసాద్ సోదరులు, డాక్టర్ బలభద్ర వెంకటరాజు, సుజాత దంపతులు, పులవర్తి లక్ష్మణస్వామి తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి బాటలు

- మేకలు, గొర్రెలు, కోళ్ల యూనిట్ల ఏర్పాటుకు ప్రత్యేక మిషన్
- కోడిగుడ్లు, మాంసం ఉత్పత్తుల పెంపు దిశగా చర్యలు
- ఔత్సాహికులకు రాయితీపై రుణాల మంజూరు



గొర్రెలను బయట ప్రాంతాలకు తరలిస్తున్న కాపరులు

రాజానగరం: వ్యవసాయ రంగంలో పశు సంపద రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. పూర్వ కాలంలో ప్రతి రైతు ఇంటితో పాటు కమతాలలో పాడి పశువులు తప్పని సరిగా ఉండేవి. కాడెద్దులకు లేదా దున్నలకు నాగలి కట్టి సాగుకు శ్రీకారం చుట్టేవారు. అయితే సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్న తరుణంలో పశువుల పాత్ర కూడా క్రమేపీ తగ్గుతూ వస్తోంది. అయితే ఇప్పటికీ కొంత మంది రైతులు పాడి పశువుల పెంపకానికి తగిన ప్రాధాన్యతనిస్తూ, పూర్వీకుల ఒరవడిని కొనసాగిస్తున్నారు. ఇటువంటి రైతులకు ప్రోత్సాహం అందిస్తే పాడి పరిశ్రమకు ఊతమిచ్చినట్లు అవుతుందని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పశుధాన్ కిసాన్ క్రెడిట్ కార్డు (పీకేసీసీ) పథకాన్ని అమలు చేస్తున్న సంగతి విదితమే. ఈ నేపథ్యంలో పాలతో పాటు కోడిగుడ్లు, మాంసం ఉత్పత్తులను సైతం పెంపు చేసేందుకు వీలుగా మేకలు, గొర్రెలు, కోళ్ల యూనిట్లను స్థాపించే దిశగా చర్యలు తీసుకుంటోంది. ఆయా ఉత్పత్తులకు అవసరమైన మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తే రైతుల ఆర్థిక పరిస్థితులు మరింత బాగు పడతాయనే ఆలోచనతో జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా నిధులను మంజూరు చేసి, ఔత్సాహికులైన వారికి ఆయా యూనిట్ల ఏర్పాటుకు గానూ రాయితీలను కూడా అందిస్తోంది.

కోళ్ల పెంపకం యూనిట్లతో లబ్ధి

ఔత్సాహికులైన రైతులు కోళ్ల పెంపకం యూనిట్లు ఏర్పాటు చేసుకొని లబ్ధి పొందడానికి కూడా అవకాశం లభిస్తుంది. జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా సుమారు వెయ్యి వరకు పెరటి కోళ్లు, కోడిపిల్లల ఉత్పత్తికి యూనిట్‌కు రూ.50 లక్షలు పెట్టుబడి పెడితే దానిలో సగం వరకు రాయితీగా అందిస్తుంది. పందుల పెంపకానికి కూడా రాయితీతో కూడిన సహకారాన్ని అందిస్తున్నారు. 50 నుంచి వంద వరకు ఆడ పందులుండి వాటిలో 10 శాతం మగ పందులు ఉండే యూనిట్‌కి రూ.30 నుంచి రూ.60 లక్షల వరకు పెట్టుబడి పెడితే దానిలో సగం వరకు రాయితీని అందిస్తున్నారు. పశు గ్రాసం, దాణాకు సైతం ప్రోత్సాహం లభిస్తుంది. ఇందుకు సంబంధించిన యూనిట్లను ఏర్పాటు చేసేందుకు చేసే ఖర్చులో 50 శాతం రాయితీని అందజేస్తారు.

ఎంతమందైనా దరఖాస్తు చేసుకోవచ్చు



జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన రుణాలు పొందేందుకు అర్హతలుంటే ఎంతమందైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి ఉన్న వారు తమను సంప్రదిస్తే సంబంధిత పోర్టల్‌లో ఏవిధంగా అప్‌లోడ్ చేసుకోవచ్చునో వివరిస్తాం. ఇప్పటికే పశువైద్య కేంద్రాల వద్ద రైతులకు అవగాహన కలిగించడం జరిగింది.

డాక్టర్ ఎంఎస్ఎస్ మూర్తి,
పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు,
రాజానగరం

దరఖాస్తు విధానం

ఇందుకు సంబంధించిన రాయితీలను పొందాలంటే 65 ఏళ్ల వయస్సు లోపు వారు ఒకరు లేదా ఇద్దరు కలిసి ముందుగా ఒక సంఘంగా లేదా కంపెనీగా ఏర్పడాలి. ఇందుకు అవసరమైన భూమి సొంతంగా కలిగి ఉండటం లేదా అద్దెకు తీసుకుని ఉండాలి. సంబంధిత యూనిట్ల ఏర్పాటుకు ఆయా జీవాల పెంపకంపై అనుభవం తప్పనిసరిగా చూస్తారు. నిబంధనల మేరకు ఇవన్నీ ఉంటే ఇందుకు సంబంధించిన పోర్టల్‌లో రాయితీల కోసం దరఖాస్తును అప్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ సమయంలో రుణాన్ని మంజూరు చేసే సమీపం బ్యాంకు మేనేజర్ సమ్మతి కూడా అవసరం.

ఆదిత్యునికి ప్రత్యేక అభిషేకాలు



దేవేరులతో సూర్యనారాయణమూర్తి

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో ప్రసిద్ధి చెందిన ఉష, ఛాయ, పద్మ, సౌంజ్ఞ సమేత ఆదిత్యుని ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని విశేష పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదం పంపిణీ చేశారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



నామవరంలో బొల్లి మాణిక్యానికి నివాళులర్పిస్తున్న జక్కంపూడి రాజా

రాజానగరం: నియోజకవర్గంలో వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆదివారం పరామర్శించారు. మండలంలోని నామవరంలో మాతృ వియోగంతో బాధ పడుతున్న బొల్లి గోవిందును కలుసుకొని సానుభూతి తెలియజేశారు. మృతురాలు మాణిక్యం చిత్ర పటానికి నివాళులర్పించారు. సీతానగరం మండలం రాపాకలో పితృ వియోగంతో బాధ పడుతున్న రావూరి రామరాజును పరామర్శించి సంతాపం తెలిపారు. వెంట స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

పన్నులు పంచాయతీలకు.. చెత్త ప్రజలకు



కాపవరం-మునగాల రహదారిపై వ్యర్థాలు

- రక్షిత నీటికి నోచుకోని జనం
- స్వచ్ఛభారత్‌కు స్వస్తి

మధురపూడి: పన్నులు చెల్లించకపోతే ముక్కుపిండి వసూలు చేసే అధికారులకు ఊరినెత్తిన చెత్త కనిపించడం లేదు. ఫలితంగా కోరుకొండ మండల గ్రామాల్లో పారిశుధ్య సమస్య తాండవిస్తోంది. కూటమి ప్రభుత్వం స్వచ్ఛ భారత్‌కు స్వస్తి పలుకుతోంది. మండలంలో 22 గ్రామాలున్నాయి. ఇక్కడ 83 వేల మంది జనాభా ఉన్నారు. గ్రామ సచివాలయాల పరిధిలో బ్లీచింగ్ చల్లడం లేదు. మురుగు నీటి కాలువల శుభ్రతతో పాటు రక్షిత నీరందించడంలో శ్రద్ధ వహించడం లేదు. వ్యర్థ పదార్థాలను రోడ్డు పక్కనే వేయడంతో దుర్వాసన వస్తోంది. వర్షం కురుస్తే దుర్భరంగా ఉంటుంది. డంపింగ్ యార్డుల అభివృద్ధి కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించక పోవడంతో రోడ్డు ప్రక్కనే వ్యర్థాలు వేస్తున్నారు. కాపవరం నుంచి మునగాల వెళ్లే రోడ్డులో చెరవు పక్కన, కణుపూరు, గాదరాడ, శ్రీరంగపట్నం, రాఘవపురం గ్రామాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోంది. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న గ్రామాలైన గాడాల, మధురపూడి, పశ్చిమ గానుగూడెం గ్రామాల్లో రహదారి ప్రక్కనే వ్యర్థాలను వేయడంతో అటుగా ప్రయాణిస్తున్న వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డంపింగ్ యార్డుల్లో తప్ప రోడ్డు పక్కన వేయకుండా చర్యలు తీసుకోవాలి.

79 వేల క్యూసెక్కుల మిగులు జలాల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి ఆదివారం సాయంత్రం 79, 231 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజ్ వద్ద 9.30 అడుగులకు నీటిమట్టం చేరింది. డెల్టా కాలువలకు 9,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,900, మధ్య డెల్టాకు 2,000, పశ్చిమ డెల్టాకు 5,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

రాష్ట్ర పోటీలకు రంగంపేట విద్యార్థులు

- జిల్లా స్కూల్ గేమ్స్‌లో విశేష ప్రతిభ



రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన రంగంపేట హైస్కూల్ విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన పాత దొడ్డిగుంట విద్యార్థులు

రంగంపేట: రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి తెలిపారు. ఈ నెల 25న రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్-17 బాలికల విభాగంలో షాట్‌పుట్‌లో పి.హర్షిత ద్వితీయ, పోల్‌వాల్ట్‌లో కె.లక్ష్మీ శ్రావ్య ప్రథమ, బాలుర విభాగంలో డి.మేఘశ్యామ్ ప్రథమ, 400 మీటర్ల రిలేలో కె.యవ్వనలక్ష్మి, అండర్-14 విభాగంలో 400, 600 మీటర్ల రిలేలో జి. ఆదినారాయణ ప్రథమ, 80 మీటర్ల హండిల్స్ గుత్తుల ఉషశ్రీ ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన పీడీ శైల, పీఈటీ చిన బూరిబాబులను, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు అభినందించారు.

పాత దొడ్డిగుంట హైస్కూల్‌లో..

జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌లో విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు అర్హత సాధించినట్టు పాత దొడ్డిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.రాధారాణి తెలిపారు. అండర్-17 డిస్కస్ త్రో పోటీలో 10వ తరగతి విద్యార్థి కె.కీర్తన ద్వితీయ, అండర్-14 లాంగ్ జంప్‌లో 8వ తరగతి విద్యార్థి కె. శ్రీవల్లి ద్వితీయ స్థానాన్ని సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. దీనికి కృషి చేసిన పీడీ దుర్గాకల్యాణిని హెచ్‌ఎం రాధారాణి, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు అభినందించారు.

నేత్రానందంగా అయ్యప్ప పడిపూజ



గణపతి హోమంలో పూర్ణాహుతిని సమర్పిస్తున్న అయ్యప్ప దీక్షాధారులు

రాజానగరం: మండలంలోని చక్రద్వార బంధంలో అయ్యప్ప స్వామి దీక్షాదారులు ఆదివారం రాత్రి నిర్వహించిన పడిపూజ నేత్రానందంగా జరిగింది. ఉదయం గణపతి హోమం జరిపి పూర్ణాహుతి సమర్పించారు. మధ్యాహ్నం గ్రామంలో పేడతుళ్లు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చక్రద్వార బంధం, వెలుగు బంద, నరేంద్రపురం, నందరాడ, రాజానగరం, తూర్పు గానుగూడెం, కానవరం, తోకాడ, పల్ల కడియం, రామస్వామి పేట, ఫరిజల్లిపేట, దివాన్ చెరువు తదితర గ్రామాల నుంచి అయ్యప్ప స్వాములు భారీగా తరలి వచ్చారు.

బస్ షెల్టర్ ఏర్పాటుకు శ్రీకారం



తూర్పు గానుగూడెంలో బస్ షెల్టర్ ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న సత్యశ్రీ

రాజానగరం: జాతీయ రహదారిని ఆనుకొని మండలంలోని తూర్పు గానుగూడెం బస్ షెల్టర్‌ని నిర్మించేందుకు ఆ గ్రామ సర్పంచ్ గల్లా సత్యశ్రీ ఆదివారం పనులకు శ్రీకారం చుట్టారు. శివాలయం వద్ద ఉన్న ఆశ్రమానికి ఎదురుగా ఉన్న ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు కొంతమంది వ్యక్తులు ప్రయత్నించడంతో గత కొంత కాలంగా వివాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో పోలీసుల సహకారంతో పనులకు ఎట్టకేలకు శ్రీకారం చుట్టారు.

రాజానగరం మండల అధికారులు

హోదా	పేరు	ఫోన్ నెంబరు
ఎంపీడీఓ	ఎస్‌జే ఝాన్సీ	96520 77166
తహసీల్దార్	ఎస్.లక్ష్మీలావణ్య	98499 03900
డిప్యూటీ తహసీల్దారు	ఎ.కుమారి	99491 00395
మండల సర్వేయర్	ఈ.అనిత	81794 14568
మండల సివిల్ సప్‌లై డిటీ	గొలుగూరి బాపిరాజు	91823 02929
మండల రీసర్వే డీటీ	బి.కాంతి	73822 86190
మండల వ్యవసాయాధికారి	ఎస్‌కే ఇమామ్ ఖాసిం	8331056550
మండల ఇంజినీర్	సంపత్ కుమార్	98661 35609
విద్యుత్ ఇంజినీర్	రాజానగరం సుధాకర్	94408 12623
విద్యుత్ ఇంజినీర్	సంపత్‌నగరం సత్యప్రసాద్	94408 12627
మండల విద్యాశాఖాధికారి 1	రామన్నదొర	94409 13928
మండల విద్యాశాఖాధికారి 2	జ్యోతిప్రసాద్	94401 71896
ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ	టి.నాగమణి	94408 14693
ఇందిరాక్రాంతి పథం (ఐకేపీ)	ఏపీఎం సునీత	79933 25065
గృహనిర్మాణశాఖ డీఈ	ఆర్‌వీ బాబు	70939 30566
గృహనిర్మాణశాఖ ఏఈ	ఏవీ రామారావు	70939 30478
సబ్‌రిజిస్ట్రార్ రాజానగరం	వెంకటేశ్వరరావు	70939 21434
రాజానగరం సీఐ	ఎస్పీ వీరయ్యగౌడ్	94407 96585
రాజానగరం ఎస్ఐ	మనోహర్	94932 06031
బొమ్మూరు సీఐ	కాశీవిశ్వనాథ్	94407 96533

పెదపూడి మండల అధికారుల ఫోన్ నంబర్లు

ఎంపీడీఓ	ఎస్.నరేంద్రరెడ్డి	(77020 73162)
తహసీల్దార్	పీవీ సీతాపతిరావు	(97014 85666)
మండల వ్యవసాయశాఖాధికారి	టీవీఆర్ మణిదీప్	(83310 56584)
ఈఓపీఆర్డీ	ఎం.సత్యనారాయణరెడ్డి	(98662 91634)
మండల పశువైద్యాధికారి	సాయికృష్ణ	(87903 64946)
మండల విద్యాశాఖాధికారి	సీవీవీ సత్యనారాయణ	(89852 51931)
సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్	కె.రామారావు	(94409 04840)
ఉపాధి హామీ పథకం ఏపీఓ		70939 98257
ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ	గంగాధర్	(91001 21151)
పంచాయతీరాజ్ ఏఈ	స్వామి	(98661 85105)



పందలపాకలో రావిచెట్టు వద్ద మద్యం షాపు



పందలపాకలో పంచాయతీ తీర్మానం కాపీ

ష్.. గప్‌చుప్!

- మద్యం షాపు ఏర్పాటులో నిబంధనలు గాలికి
- పందలపాకలో రావిచెట్టు వద్ద నూతన షాపు

బిక్కవోలు: అడిగేవారు లేరు.. పట్టించుకునే వారు కానరారు.. నిబంధనలూ గాలికి వదిలేస్తారు.. కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన మద్యం పాలసీలో భాగంగా ప్రజల ముంగిటకే మద్యం వచ్చింది.. ఇచ్చిన హామీలను పట్టించుకోకపోయినా ఇంటి దగ్గరకే మద్యం షాపులను తీసుకువచ్చింది. ఇప్పటికే సిండికేట్ హస్తగతం చేసుకున్న మద్యం దుకాణాలకు అనుగుణంగా బెల్టు షాపులు వెలిశాయి. పందలపాక గ్రామంలో ఒక షాపు ఊరి శివారున ఉండగా, ఇవి సరిపోదు అన్నట్టు స్థానిక ప్రాథమిక పాఠశాలకు 95 మీటర్ల దూరంలో మరోషాపు ఏర్పాటు చేశారు. దీనికి ఇంకా పూర్తి స్థాయిలో లైసెన్స్ రాకపోయినా రావిచెట్టు సెంటర్ వద్ద షాపు పెట్టేశారు. అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కళాశాలలకు వెళ్లి వచ్చే విద్యార్థులు అక్కడే బస్సు ఎక్కుతుంటారు. సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే మార్గం ఇదే. సంత మార్కెట్‌కు, విద్యార్థులు పాఠశాలకు వెళ్లి వచ్చే దారి ఇదే కావడంతో ప్రజలు నిట్టూర్పు వదులుతున్నారు. అసలు ప్రజల సమస్యలు పట్టించుకోని నేతలు ఇలా మద్యం దుకాణాలను ఏర్పాటు చేసి తమను ఇబ్బందులపాల్జేయడం సరికాదని నిప్పులు చెరిగారు.

నిలుపుదల చేయాలని తీర్మానించినా..

పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసి షాపును నిలుపుదల చేయాలని ఎక్సైజ్ అధికారులను కోరారు. అయినా పట్టించుకోకపోవడం శోచనీయం. ఈ విషయమే ఎక్సైజ్ సీఐ సుధను వివరణ కోరగా రావిచెట్టు వద్ద పెట్టిన షాపునకు ఇంకా అనుమతులు రాలేదన్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం షాపును పరిశీలించి ప్రజలకు ఇబ్బంది ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. మూడు రోజులుగా ఇక్కడ షాపు పెడుతున్నారని తెలిసినా అధికారులు పట్టించుకోలేదు. తమ గ్రామంలో ఇళ్ల మధ్య మద్యం షాపులు లేకుండా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.